క్లుప్తంగా

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

సత్తెనపల్లి: పట్టణంలోని 31, 01 వార్డుల పరిధిలోని కబ్బయ్య స్వామి రామాలయం ప్రాంగణంలో ఈ నెల 15న సాయంత్రం 5 గంటలకు గజ్జల నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో జీబీఆర్ హాస్పిటల్, నరసరావుపేట వైద్య బృందంచే ఉచితంగా మెగా వైద్య శిబిరం జరుగుతుందని గజ్జల నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఎముకలు, కీళ్లు, గుండె, థైరాయిడ్, నెమ్ము, ఆయాసం, కళ్లు తిరుగుట, వాంతులు, ప్రసూతి వైద్య విభాగం (గర్భిణులకు), దంత వ్యాధులకు తగిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వబడునన్నారు. ఆయా రుగ్మతలు కలిగిన వారు శిబిరంలో వైద్య సేవలు పొందాలని కోరారు.

వైద్యశాల ప్రాంగణంలో అన్న సంతర్పణ



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణ పథకంలో భాగంగా జనసేన పార్టీ నాయకుడు అప్పాపురం నరేంద్ర ఆధ్వర్యంలో బుధవారం కటకం కాశీ విశ్వనాథం ధర్మపత్ని కాశీకుమారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా 140 మంది నిరుపేద రోగులు, వారి సహాయకులకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నిస్వార్థంగా చేస్తున్న సేవకు ప్రతిఫలంగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నందుకు నరేంద్రను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ సుజాత, డాక్టర్ జీవన్ జ్యోతి, నాయకులు చౌటా శ్రీనివాసరావు, జవ్వాజి రామోహన్‌రావు, సూరే కోటేశ్వరరావు, కట్టమూరు అప్పారావు, పోతుగంటి నరసింహారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పెదకూరపాడు : పెదకూరపాడు షిరిడీ సాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, అనంతరం పలు రకాల పుష్పాలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేతలు రమేష్, గోపాలరావు, అప్పారావు, ఆంజనేయులు, బాబు, ప్రసాద్, బుల్లిబాబు, ముంతాజ్, కల్పన, మస్తాన్‌షరీఫ్, మలాట్ రఫీ, బొబ్బిలి, ఆలయ కమిటీ సభ్యులు గంటా బాబు, తిరుమల్లి, శ్రీధర్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేపట్టారు. సాయంత్రం ఆలయ ఆవరణలో చేపట్టిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

మున్సిపల్ కాంప్లెక్స్ ఖాళీ గదులకు వేలం

సత్తెనపల్లి: పట్టణంలోని పురపాలక సంఘానికి సంబంధించిన వివిధ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో ఖాళీగా ఉన్న రూములకు మూడు సంవత్సరాల వేలంనకు నెలవారి అద్దె ప్రాతిపదికన అద్దెకు ఇచ్చేందుకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఎన్టీఆర్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 3, 6, 7, 10, 11, 12, 13, 14, 18, 19, 21, 34, 39 నంబర్ల షాపులకు, యర్రం వెంకటేశ్వరరెడ్డి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 8, 15 షాపులకు వావిలాల గోపాల కృష్ణయ్య షాపింగ్ కాంప్లెక్స్‌లో 10వ నంబరు షాపుకు బహిరంగ వేలంలో హెచ్చు పాట పాడిన వారికి కేటాయించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ తెలిపారు. ఈ బహిరంగ వేలంలో ఎన్టీఆర్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 11 నంబర్ షాపుకు అత్యధికంగా రూ.23 వేలు హెచ్చు పాట పాడినట్లు ఆయన తెలిపారు.

అకాల వర్షంతో ఉపశమనం



ముప్పాళ్ళ: ఉక్కపోత, వేడి గాలులతో ఉక్కిరిబిక్కిరి అయిన మండల వాసులకు బుధవారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షంతో కొంత ఉపశమనం లభించింది. ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షం పడటంతో రహదారులపై చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. చాగంటివారిపాలెం గ్రామంలోని సాయిబాబా గుడి వెనుక ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. సత్తెనపల్లి–నరసరావుపేట రోడ్డు నుంచి బొల్లవరం వెళ్లే రహదారిపై చెట్టు విరిగి అడ్డంగా పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామస్తులంతా కలిసి చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. సత్తెనపల్లి వైపు వెళ్లే రహదారిపై అక్కడక్కడ చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి.

ఈ మలుపులతో ముప్పు..!



పెదమద్దూరు వద్ద మూలమలుపు



వైకుంఠపురం వద్ద మూల మలుపు

- అమరావతి, విజయవాడ మార్గంలో ప్రమాదకరంగా మలుపులు
- మండల పరిధిలో 9 కిలోమీటర్ల పరిధిలో 5 ఎస్ టర్నింగ్‌లు
- హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు

అమరావతి/పెదకూరపాడు : మండల పరిధిలోని అమరావతి వైకుంఠపురం గ్రామాల మధ్య కేవలం 9 కిలోమీటర్ల పరిధిలో 5 ప్రమాదకర మూల మలుపులతో ముప్పు పొంచి ఉంది. అమరావతి నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో ప్రమాదకరమైన మలుపులతో నిత్యం ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవటంతో పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డులో అమరావతి నుంచి విజయవాడ, తుళ్ళూరు, మంగళగిరి వెళ్లటానికి అలాగే అచ్చంపేట, క్రోసూరు, పెదకూరపాడు మండలాల్లోని గ్రామాల నుంచి విజయవాడ వెళ్లటానికి ఈ ములుపుల మీదుగానే ప్రయాణించాల్సిన పరిస్థితి. పలు గ్రామాల నుంచి విజయవాడ వచ్చే వాహనాలతో పాటు పలు ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక రవాణా చేసే భారీ వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటీవల కాలంలో రోడ్డు పూర్తిగా ధ్వంసమవటంతో వాహనాల రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు.



పెదకూరపాడు రైల్వేస్టేషన్ సమీపంలో

9 కి.మీ... 5 ములుపులు

వైకుంఠపురం నుంచి అమరావతి మార్గంమధ్యలో కేవలం తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఐదు చోట్ల ప్రమాదకరమైన ఎస్ టర్నింగ్‌లు ఉండటం వల్ల ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉంది. ఈ టర్నింగ్‌ల వద్ద ద్విచక్ర వాహనాలు, ఆటోలు, లారీలు, ఆర్టీసీ బస్సులకు గతంలో ప్రమాదాలు జరిగినా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకున్న ధాఖలాలు లేవు. ఇక్కడ తరచూ ప్రమాదాలలో చిక్కుకుని గాయాలపాలయిన వారు అనేకం. అలాగే కొన్ని సందర్భాలలో మరణాలు కూడా సంభవించాయి. ఎన్ని ప్రమాదాలు జరిగినా, ఎంత మంది మరణించినా అధికారులు స్పందించడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ రాజధాని అమరావతి పర్యటనను పురస్కరించుకుని రోడ్డుకు మరమ్మతులు చేయటంతో వాహనాలు వేగంగా వస్తున్నాయి. అలా వేగంగా వచ్చే వాహనాలకు మూలమలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను అలాగే పెదమద్దూరు వాగు చప్టాపై రెండు వైపులా ప్రమాదాలను నివారించే విధంగా రహదారులు, భవనాల శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



పరస తాళ్ళూరు గ్రామాల మధ్య మూలమలుపు

పెదకూరపాడు మండలంలో...

మండల పరిధిలోని పరస తాళ్ళూరు గ్రామాల మధ్య, అలాగే పెదకూరపాడు పాటిబండ్ల గ్రామాల మధ్య, పెదకూరపాడు రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న మూలమలుపులు మృత్యుకుహరాలుగా ఉన్నాయి. ఇక్కడ నిత్యం అనేక ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్లలో ఆర్ అండ్ బీ అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవటంతో అనేక ప్రమాదాలు జరిగాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పది ఫలితాల్లో కేంద్రీయ విద్యాలయ విద్యార్థుల ప్రతిభ



జె.యశ్వంత్



తపన్ చౌదరి



ప్రీతమ్ నారాయణసాయి

సత్తెనపల్లి: పది ఫలితాల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం విడుదలైన సీబీఎస్‌ఈ ఫలితాల్లో సత్తెనపల్లి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 25 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరుకాగా 25 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 100 శాతం ఫలితాలు సాధించారు. పాఠశాలకు చెందిన జె.యశ్వంత్ 479/500, తపన్ చౌదరి 469/500, ప్రీతమ్ నారాయణసాయి 450/500 మార్కులతో ప్రతిభ చూపినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిరణ్ రెడ్డి బుధవారం తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

లక్కరాజు గార్లపాడులో ఇంటిపై పడిన పిడుగు

సత్తెనపల్లి: పిడుగు పడి త్రుటిలో ప్రమాదం తప్పిన సంఘటన సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడులో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్మి ఈదురు గాలుల, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో లక్కరాజుగార్లపాడు గ్రామంలో సత్తెనపల్లి ఏడుకొండలు ఇంటిపై పిడుగు పడటంతో పిట్ట గోడ, బీము, పోల్స్ పగిలిపోయాయి. ఇంట్లోని టీవీ, విద్యుత్ వైర్లు కాలిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఒక్కసారిగా ఇంటిపై పిడుగు పడటంతో ఆ కాంతికి ఇంట్లోని కుటుంబ సభ్యులకు కళ్లు బైర్లు కమ్మాయి. అయితే ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. జనం తడోప తండాలుగా డాబాలు ఎక్కి పిడుగు పడిన ప్రాంతాన్ని పరిశీలించారు.

విద్యుత్ ఏఈని నిలదీసిన టీడీపీ వార్డు సభ్యుడు కోదండరామిరెడ్డి

అనంతవరం(క్రోసూరు): మండలంలోని అనంతవరం గ్రామంలో టీడీపీ వార్డు సభ్యుడు దొండేటి కోదండరామిరెడ్డి విద్యుత్ ఏఈ బసవరాజును తనకు అధికంగా బిల్లు ఎందకొచ్చిందో సమాధానం చెప్పాలంటూ నిలదీసిన వీడియో సోషల్ మీడియాలో బుధవారం హల్‌చల్ అయింది. వార్డు సభ్యుడు తనకు ప్రతి నెల రూ.2 వేలు వచ్చే విద్యుత్ బిల్లు ఏకంగా రూ.23 వేలు ఎందుకొచ్చిందో సమాధానం చెప్పాలంటూ విద్యుత్ ఏఈని నిలదీసాడు. రోడ్డుపై ధర్నా చేస్తాను, బస్సులు ఆపుతానంటూ ఏఈని నిలదీసాడు. దీనిపై ఏఈ బసవరాజును వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ గతంలో నాలుగు నెలలు ఇంట్లో లేకపోవటంతో రూ.10 వేలు బిల్లు బకాయి ఉందని, అంత చెల్లించలేను, తగ్గించాలంటూ తనను కోరటం జరిగిందని తెలిపారు. ఉన్నతాధికారులతో(సత్తెనపల్లి ఈఆర్వో) మాట్లాడటంతో రూ.3,300 తగ్గించి బకాయి మొత్తం కట్టమన్నారని అన్నారు. అంతేకాక ప్రస్తుతం విద్యుత్ వాడుకున్న తాలూకు మూడు నెలల బిల్లు చెల్లించాల్సి ఉంది. అతనికి తగ్గించిన రూ.3,300 పోను ప్రస్తుతం మూడు నెలల బకాయిలు కలిపి మొత్తం రూ.23 వేలు చెల్లించాలని చెప్పటం జరిగిందని తెలిపారు. అయితే కోదండరామిరెడ్డి బకాయి చెల్లంచనని, మాపై చర్యలు తీసుకుంటానని, ఎమ్మెల్యేతో చెబుతానని, ధర్నా చేస్తానని తమపై ఆగ్రహించాడని చెప్పారు. అయినప్పటికీ బకాయి చెల్లించనందున సర్వీసు వైరు తొలగించటం జరిగిందని అన్నారు.

భారతీ సిమెంట్ సహకారంతో కార్మికులకు బీమా



దాచేపల్లి: భారతి సిమెంట్ కంపెనీ సహకారంతో భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలకు లక్ష రూపాయల బీమా కల్పించే కార్యక్రమం చేపట్టింది. కంపెనీ సేల్స్ మేనేజర్ జయరామిరెడ్డి, టెక్నికల్ అధికారి శంకర్ ఆధ్వర్యంలో దాచేపల్లిలోని కారంపూడి రోడ్డులోని సిమెంట్ డీలర్ వాసవీ స్టీల్స్ నిర్వాహకులు దేవరశెట్టి రోజా చంద్రశేఖర్, దేవరశెట్టి నాగేశ్వరరావు దుకాణం వద్ద భవన నిర్మాణ కార్మికులకు, మేస్త్రీలకు అవగాహన సదస్సు బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా జయరామిరెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి తయారు చేసిన నాణ్యమైన సిమెంట్ భారతి సిమెంట్‌ను భవన నిర్మాణాలకు ఎంచుకోవాలని కోరారు. భారతి సిమెంట్‌తో స్లాబ్ వేస్తే తమ కంపెనీ ప్రతినిధులు ఏడు రోజులలో వచ్చి నాణ్యత పరిశీలిస్తారని వివరించారు. మేస్త్రీలు, కార్మికుల సందేహాలకు కంపెనీ ప్రతినిధులు సమాధానాలు ఇచ్చారు. సదస్సులో పాల్గొన్న కార్మికులకు లక్ష రూపాయల బీమా సదుపాయం కల్పించే బాండ్లను అందజేశారు.

20లోగా అన్నదాత సుఖీభవకు నమోదు చేసుకోండి

క్రోసూరు: రైతులకు అన్నదాత సుఖీభవ సాయాన్ని ఖరీఫ్‌కు ముందే అందించేందుకు ప్రభుత్వం తీసుకొనే చర్యల్లో భాగంగా ఈ నెల 20లోగా రైతు సేవా కేంద్రాల్లో సంబంధిత ధ్రువపత్రాలతో నమోదు చేసుకోవాలని ఏవో వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో వివరాలను అందజేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ సిబ్బంది జాబితా సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు పొలం పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, ఫోను నంబర్, 1బీ వివరాలు అందజేయాలన్నారు.

తగలబడిన మిరప నర్సరీ



పెదపాలెం(క్రోసూరు): అచ్చంపేట మండలం అచ్చంపేటలోని పెదపాలెం రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మిరప నర్సరీకి అగ్నిప్రమాదం సంభవించి తగలబడిపోయిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం అందుకున్న క్రోసూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వివరాలను తెలుపుతూ సూరే వెంకట కోటిలింగంకు చెందిన పొలాన్ని అమరాది శ్రీనివాసరావు లీజుకు తీసుకుని నర్సరీ నిర్వహిస్తున్నాడు. ఎకరం నెట్లో 15 వేల ట్రేలలో ఉన్న మిరప నారులో అర ఎకరం మేర తగలబడినట్లు తెలిపారు. నష్టం ఎంత మేర అన్నది తెలియరాలేదు.

ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినికి ప్రోత్సాహం

బెల్లంకొండ: సీబీఎస్‌ఈ పదవ తరగతి ఫలితాలలో 580 మార్కులు సాధించి, మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన మాచాయపాలెం గ్రామానికి చెందిన భాగం ప్రసన్నకు బెల్లంకొండ ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి బుధవారం నగదు ప్రోత్సాహం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన ప్రసన్న కష్టపడి చదివి మంచి మార్కులు సాధించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత విద్య అభ్యసించాలని ఆకాంక్షించారు. గ్రామ నాయకులు పాల్గొన్నారు.

చదువును సక్రమంగా ఉయోగించినప్పుడే ఉన్నత స్థితి

తెలంగాణ రాష్ట్ర సీఏస్సీ కోర్టు సూపరింటెండెంట్ అంజనీకుమారి



మాట్లాడుతున్న అంజనీకుమారి

సత్తెనపల్లి: యువత సమయాన్ని, చదువుకున్న చదువుని సక్రమంగా ఉపయోగించుకున్నప్పుడే ఉన్నత స్థితిని పొందవచ్చని తెలంగాణ రాష్ట్ర సీఏస్సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనీకుమారి అన్నారు. హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీయువకులకు పట్టణంలోని టీచర్స్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యువత దేశ సంపద అని, చదువుకున్న ప్రతి వ్యక్తి తన చదువును సార్థకం చేసుకునే క్రమంలో సంపాదన అనేది ఎంతో ముఖ్యమైనదన్నారు. చిన్ననాటి నుంచి చదువు పట్ల మక్కువ కలిగి తక్కువ సమయంలో స్థిర పడినప్పుడు భవిష్యత్తు బాగుంటుందన్నారు. ముందుగా ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన సైనికులకు నివాళులర్పించి యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాబ్‌మేళాకు నిరుద్యోగ యువత 180 మంది హాజరయ్యారు. 17 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమానికి హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్ కో ఆర్డినేటర్ రామకృష్ణారెడ్డి, బాల ఆదిత్య డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వెంకటేష్, వినుకొండ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ ఏసయ్య, గుంటూరు జిల్లా హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సునీత, పల్నాడు జిల్లా అధ్యక్షురాలు సౌజన్య, ఉమ్మడి గుంటూరు జిల్లా హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల కృష్ణ, టీచర్స్ మస్తాన్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాకు హాజరైన యువతీ, యువకులు

బాలలు క్రీడలలో ఉత్సాహం చూపించాలి

గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

క్రోసూరు: బాలలు చదువుతోపాటు క్రీడలలో ఉత్సాహం చూపించాలని గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా బుధవారం బాలలకు నీతి కథలు బోధించారు. జనరల్‌నాలెడ్జి, ఇంగ్లీషు చదివించటం చేయించారు. అనంతరం చెస్, పాము నిచ్చెన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఆటలు ఆడటం వలన శారీరక శ్రమ, వ్యాయామం అలవాటు అవుతాయన్నారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న ఏఓ బ్రహ్మారెడ్డి

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని విత్తన విక్రయ కేంద్రాలలో అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి హెచ్చరించారు. విత్తనాల షాపులలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లైసెన్స్ తీసుకోకుండా రైతులకు విత్తనాలు విక్రయించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. షాపు నిర్వహణకు సంబంధించి ప్రతి సంవత్సరం ప్రభుత్వ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. విత్తనాల షాపు నిర్వాహకులు ఎవరైనా అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే వారిపై విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధరల విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు అయితే అటువంటి షాపులను శాఖాపరమైన చర్యలు తీసుకుని సీజ్ చేస్తామన్నారు. 25 నుంచి 35 రకాల కంపెనీలకు చెందిన విత్తనాలను పరిశీలించినట్లు చెప్పారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో విత్తనం ఏ కంపెనీకి చెందినది, రకం పేరు, లాట్ నంబర్‌తో సహా కొనుగోలు రసీదుపై రాయించుకుని పంట దిగుబడి వచ్చే వరకు కూడా భద్ర పరుచుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఎంఏఓలు గొంటు కృష్ణారెడ్డి, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఫాతిమామాత మందిర వార్షికోత్సవం



ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శమిచ్చిన ఫాతిమా మాత

రెంటచింతల: కరణమయురాలు తల్లి ఫాతిమా మాత అని రె.ఫాదర్ తుమ్మా థామస్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జండా చెట్టు సెంటర్ వద్ద నున్న ఫాతిమామాత మందిరం వార్షికోత్సవం సందర్భంగా కానుకమాత చర్చి విచారణ సహాయ గురువులు జి.అగస్టీన్ ఆధ్వర్యంలో సమష్టి దివ్యపూజాబలిలో భక్తులను ఉద్దేశించి ఫాదర్ మాట్లాడారు. భక్తులకు మొత్తం ఏడుసార్లు దర్శన మిచ్చిన ఫాతిమామాతను ప్రార్థించి ఇతరులతో ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ జపమాల మాతగా దర్శనమిచ్చిన ఫాతిమామాతను మంచి జీవితం కోసం, ప్రపంచశాంతి కోసం ప్రార్థించాలని, పాపపు జీవితాలను విడనాడి దేవుని సూక్తులను ఆచరించి త్యాగపూరితమైన జీవితాన్ని జీవించాలని ఆకాంక్షించారు. 1997లో ఫాదర్ పూదోట ఇన్నయ్య చేతుల మీదుగా ఈ మందిరాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. మందిరాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో ఫాదర్ కొణతం ఏలీషారాజు, మందిరం స్థాపకులు ఏరువ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం.. పట్టించుకోరా!



ప్రమాదకరంగా ఉన్న శిథిలావస్థకు చేరిన భవనం

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో 7వ వార్డు ప్రధాన పోస్టల్ కార్యాలయం పక్కన ఉన్న ఈ భవనం గత 35 సంవత్సరాల నుంచి ఈ గది తలుపులు తెరుచుకున్న దాఖలాలు దాదాపుగా లేవు. రెండు రోజుల క్రితం తేలికపాటి గాలి, వర్షానికి పైనున్న గోడ కూలి సమీపంలో నిలబడిన వారిపై పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం పొంచి ఉన్నా అటు భవన యజమానులు గానీ, ఇటు మున్సిపల్ అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాన్ని ప్రమాదం జరగకముందే తగు చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయం రూ.33,693

నకరికల్లు: స్థానిక కొండపై వేంచేసి ఉన్న ఆదిలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి తిరునాళ్ల సందర్భంగా హుండీ ఆదాయం రూ.33,693 వచ్చినట్లు ఈఓ ఆర్.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. సోమ, మంగళవారాల్లో జరిగిన తిరునాళ్ల, కల్యాణ వేడుకల అనంతరం భక్త సంఘం సమక్షంలో హుండీల్లో వచ్చిన కానుకలను బుధవారం లెక్కించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి జ్యోతి మహోత్సవాలు



రెంటచింతల: స్థానిక చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బుధవారం వేకువజామున జ్యోతి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజ చేశారు. దేవస్థానం నుంచి గ్రామంలోని బ్రహ్మంబావి, కాయితి కృష్ణారెడ్డి బజారు, దేవరమిద్ది ఆంజనేయస్వామి గుడి, సాయిబాబా మందిరం, బొడ్డురాయి సెంటర్, ఆనచెట్టు దగ్గర వరకు జ్యోతులతో గ్రామోత్సవం సాగింది. కార్యక్రమంలో పెద్దశెట్టి జోకా కొండలు, కమిటీ సభ్యులు శీలం నారాయణ, పోలిశెట్టి శ్రీనివాసరావు, పాత మట్టపల్లి, పోలిశెట్టి వేణు, కోనేటి మురళి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాదలలో అంధకారం



మాదల(ముప్పాళ్ళ): ఈదురుగాలులతో కూడిన వర్షానికి చెట్లతో పాటు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో మండలంలోని మాదల, రుద్రవరం గ్రామాల్లో పూర్తిగా అంధకారం నెలకొంది. ఈదురు గాలుల ధాటికి స్తంభాలు విరిగి పోగా, మరికొన్ని రోడ్డుపై అడ్డంగా పడిపోయాయి. రెండు గ్రామాల మధ్య పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు పడిపోవటంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. మాదల, రుద్రవరం గ్రామాల్లో అంధకారం నెలకొంది. సమాచారం అందుకున్న ముప్పాళ్ళ ఎస్సై వి.సోమేశ్వరరావు గ్రామస్తుల సహకారంతో జేసీబీ సాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా పునరుద్ధరించే చర్యలు చేపట్టారు.